ప్రజాశక్తి
మంగళవారం 3 జనవరి 2023
5
శ్రీకాకుళం

నలుగురు సిఐల బదిలీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి
జిల్లాలో నలుగురు సిఐలను బదిలీ చేస్తూ డిఐజి ఎస్.హరికృష్ణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం రెండో పట్టణ సిఐ ఆర్.ఇ.సిహెచ్ ప్రసాద్‌ను ఇచ్ఛాపురం సర్కిల్‌కు బదిలీ చేశారు. ఇచ్ఛాపురం సిఐగా పనిచేస్తున్న డి.వి.వి సతీష్ కుమార్‌ను దిశ మహిళా పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. శ్రీకాకుళం సిసిఎస్ సిఐగా పనిచేస్తున్న ఆదాయను జె.ఆర్ పురం సిఐగా బదిలీ చేశారు. విఆర్‌లో ఉన్న పి.శ్రీనివాసరావును శ్రీకాకుళం రెండో పట్టణ స్టేషన్ సిఐగా నియమించారు. జె.ఆర్ పురం సిఐ బి.సిహెచ్ స్వామినాయుడును విఆర్‌కు పంపించారు.

కొత్త ఏడాదిలోనైనా పూర్తయ్యేనా?

- అసంపూర్తిగా వంశధార పనులు
- అర్ధాంతరంగా ఆగిపోయిన ఆఫ్‌షోర్
- నదుల అనుసంధాన ప్రక్రియ 30 శాతం పెండింగ్
- ఖరీఫ్‌లో నీళ్లిస్తామని ప్రభుత్వం ప్రకటన



వంశధార, ఆఫ్‌షోర్‌లను ప్రభుత్వం ప్రాధాన్యతా ప్రాజెక్టుల జాబితాలో చేర్చినా పనులు మాత్రం ఆశించిన స్థాయిలో జరగలేదు. వైసిపి అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లయినా పెద్దగా పురోగతి కనిపించడం లేదు. వీటిని ఈ ఏడాదిలోనే పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. అందుకనుగుణంగా నిధుల విడుదల, అనుమతుల మంజూరు కావడం లేదు. వంశధార, నాగావళి నదుల అనుసంధాన పనులు నత్తనడకనే సాగుతున్నాయి. వంశధార, నాగావళి వరదల నుంచి రక్షణ కల్పించేందుకు నిర్మించ తలపెట్టిన కరకట్టల పనులపై అధికారులు పలుమార్లు పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం కనీసం ఆమోదం కూడా తెలపలేదు. ప్రధాన సాగునీటి ప్రాజెక్టులతో నదుల అనుసంధానం పనులు ఈ ఏడాదిలోనైనా పూర్తయితే కొంతవరకైనా సాగునీటి సమస్యలు తీరే అవకాశం ఉండడంతో, ప్రాజెక్టుల పూర్తిపై రైతులు ఆశలు పెట్టుకుంటున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార ఫేజ్-2, స్టేజ్-2 పనులు ప్రస్తుతం మూడు ప్యాకేజీలుగా జరుగుతున్నాయి. 87, 88 ప్యాకేజీలు, హిరమండలం రిజర్వాయర్ పనులుగా విభజించారు. వీటిలో 87 ప్యాకేజీ పనులు 82 శాతం పూర్తయ్యాయి. 88 ప్యాకేజీ పనులు 92 శాతం జరిగాయి. హిరమండలం రిజర్వాయర్ పనులు ఇప్పటివరకు 91 శాతం మాత్రమే పూర్తయ్యాయి. పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో వీటన్నిటికీ అప్పట్నుంచి ఆరు మాసాలు చొప్పున పొడిగిస్తూ వచ్చారు. చివరిసారిగా ఈ డిసెంబర్ 31వ తేదీ వరకు మరోసారి పొడిగించారు. పనులు పూర్తి కాకపోవడంతో ఈ ఏడాది జూన్ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించుకుంది. మరోవైపు గొట్టాబ్యారేజీ కుడి ప్రధాన కాలువపై ఎత్తిపోతల పథకం నిర్మించి రిజర్వాయరు నింపాలని ప్రభుత్వం గతేడాది నిర్ణయించింది. అందుకనుగుణంగా రూ.180 కోట్లను మంజూరు చేసింది. ప్రస్తుతం అంచనా వ్యయం న్యాయ సమీక్ష పరిశీలనలో ఉంది. పనులను ఈ ఏడాదిలోనే పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. పరిపాలన, సాంకేతిక పనులు మంజూరైతే పనులు మొదలుపెడతామని అధికారులు చెప్తున్నారు.

ఆఫ్‌షోర్‌లో 62 శాతం పనులు జరిగేనా?

ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు ప్రస్తుతం 38 శాతం మేర చేపట్టారు. 83,31,000 క్యూబిక్ మీటర్ల మట్టి పనులు చేపట్టాల్సి ఉండగా 42,36,527 క్యూబిక్ మీటర్ల పని పూర్తయింది. ఇంకా 40,94,473 క్యూబిక్ మీటర్ల పని మిగిలి ఉంది. కాంక్రీట్ పనులు 1,31,544 క్యూబిక్ మీటర్ల పని చేపట్టాల్సి ఉండగా ఇప్పటివరకు 2,457 క్యూబిక్ మీటర్ల పని పూర్తయింది. మరో 1,29,087 క్యూబిక్ మీటర్ల పని పెండింగ్‌లో ఉంది. మరోవైపు భూసేకరణ కూడా పెండింగ్‌లో ఉంది. రిజర్వాయర్ కోసం 2,435.72 ఎకరాలు కావాల్సి ఉండగా, ఇప్పటివరకు 2,338.74 ఎకరాలను సేకరించారు. ఇంకా 96.98 ఎకరాలు సేకరించాల్సి ఉంది. ఆఫ్‌షోర్ పూర్తి కావాలంటే ఈ ఏడాది 62 శాతం పనులు కావాల్సి ఉంది.

అసంపూర్తిగా నదుల అనుసంధానం

అనుసంధాన పనులకు సంబంధించి సంబంధిత కాంట్రాక్టర్‌కు రూ.13 కోట్లు చెల్లించాల్సి ఉంది. గతేడాది డిసెంబర్ వరకు చేపట్టని పనులకు సంబంధించి రూ.11 కోట్ల వరకు చెల్లించింది. మార్చిలో బిల్లులు చెల్లించినా పనుల కొనసాగింపునకు సంబంధిత కాంట్రాక్టర్ ముందుకు రాలేదు. అధికారులు పలుమార్లు నోటీసులు ఇచ్చినా స్పందించలేదు. జలవనరులశాఖ అధికారులు చివరిగా పెనాల్టీ నోటీస్ జారీ చేశారు. కాంట్రాక్టర్ అర్ధాంతరంగా పనులు విడిచిపెట్టి వెళ్లిన సందర్భంలో కొత్తగా పనులు చేపట్టే నిర్మాణ సంస్థకు అయ్యే అదనపు ఖర్చును ప్రస్తుత కాంట్రాక్టరే భరించాల్సి ఉంటుంది. దీంతో పివి రమణయ్య అండ్ కో కంపెనీ దిగొచ్చి పనులను ప్రారంభించింది. ప్రస్తుతం పనులు మందకొడిగానే సాగుతున్నాయి. ఇప్పటివరకు 70 శాతం పనులు జరిగాయి. ఈ ఏడాది ఖరీఫ్‌లో నీళ్లందిస్తామని అధికారులు చెప్తున్నారు.

కరకట్టల పనులు మొదలయ్యేనా?

వంశధార నదిపై నిర్మించాల్సిన కరకట్టలను నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. మొదటి ప్యాకేజీ పనిని 2007 ప్రారంభంలో రూ.44.77 కోట్లతో ప్రారంభించారు. మూడు ప్యాకేజీలకు ఒకే నిర్మాణ సంస్థ దక్కించుకోగా, ప్యాకేజీ-4 పనులను వేరే నిర్మాణ సంస్థ చేజిక్కించుకుంది. ఆయా నిర్మాణ సంస్థలు 2010-11 నాటికి ఎంతమేర పనులు చేసి ఆపేశాయో అక్కడ నుంచి నేటి వరకు అదనంగా ఒక్క శాతం పనులు కూడా చేపట్టలేదు. కరకట్టల నిర్మాణానికి పెద్దఎత్తున భూమిని సేకరించాల్సి ఉండడం, భూసేకరణకు అధికంగా నిధులు వెచ్చించాల్సి రావడంతో ప్రభుత్వం ఉన్నపళంగా కరకట్టలను ఆపేసింది. నాగావళి నదిపై నిర్మిస్తున్న కరకట్టలు కూడా అసంపూర్తిగానే ఉన్నాయి. 2008 లోనే పనులను ప్రారంభించింది.

ఇప్పటికీ పనుల్లో పెద్దగా పురోగతి కనిపించడం లేదు. జిల్లా పరిధిలో 51.88 కి.మీ మేర వరద కట్ట నిర్మించాల్సి ఉండగా, ఇప్పటివరకు 17.29 కి.మీ పొడవు మేర మాత్రమే పని పూర్తయింది. వంశధార, నాగావళి కరకట్టల పనులు 2014 వరకు 2007-08లో 5.66 శాతం నుంచి 21.34 శాతం మాత్రమే పూర్తయ్యాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఉన్న పళంగా పనులను నిలిపేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ముంపు తీవ్రత అధికంగా ప్రాంతాలను గుర్తించి అందులో ముఖ్యమైన పనులకు ప్రాధాన్యమివ్వాలన్న ప్రభుత్వ ఆదేశాలతో నాగావళి కరకట్టలకు సంబంధించి అధికారులు తొలుత ఐదు ప్రాంతాలను గుర్తించారు. కొత్త ప్రతిపాదనల మేరకు కరకట్టల నిర్మాణానికి రూ.130 కోట్లు ఖర్చవుతుందని అధికారులు నివేదిక పంపారు. ప్రతిపాదనలు పంపి ఒకటిన్నర ఏళ్లు గడచినా ప్రభుత్వం ఇప్పటికీ ఆమోదం తెలపలేదు. కొత్త సంవత్సరంలోనైనా పూర్తయితే కొంతమేరకైనా వరదల నుంచి రక్షణ లభిస్తుందని నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు ఆశిస్తున్నారు.

అదనపు పరిహారం చెల్లించేదెప్పుడు?

వ్య.కా.స జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్

ప్రజాశక్తి - హిరమండలం

వంశధార నిర్వాసితులకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. సంకిలి నిర్వాసితులతో కలిసి సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాసితులకు పెండింగ్‌లో ఉన్న అదనపు పరిహారాన్ని ఎప్పుడు చెల్లిస్తారని ప్రశ్నించారు. వంశధార నిర్వాసితులకు ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో జగన్మోహన్ రెడ్డి గొట్టాబ్యారేజీ సెంటర్ వద్ద రిలే నిరాహారదీక్ష శిబిరాన్ని సందర్శించి, వైసిపి అధికారంలోకొస్తే 2013 భూసేకరణ చట్టం వర్తింపజేసి పరిహారం చెల్లిస్తామని హామీనిచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లయినా అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. కొద్దిమంది వంశధార నిర్వాసితులకు పరిహారం అందించి చేతులు దులుపుకోవడం అన్యాయమన్నారు. అర్హులైన నిర్వాసితులందరికీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, లేకుంటే నిర్వాసితుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తులసీరావు, కె.నీలారావు, లక్ష్మి, వసంత తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న వంశధార నిర్వాసితులు

బాబు మీటింగ్‌లను బహిష్కరించాలి

వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్




నరసన్నపేట: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు పబ్లిసిటీ పిచ్చికి జనం బలవుతున్నారని ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరుసగా బాబు సభల్లో ప్రజలు ప్రాణాలు కోల్పోతుండడంతో ఆ పార్టీ మీటింగ్‌లను ప్రజలు బహిష్కరించాలని కోరారు. చంద్రబాబు ఎక్కడ కాలు పెడితే అక్కడ నాశనమేనని విమర్శించారు. సభల కోసం జనాన్ని తీసుకొచ్చి పిచ్చి పబ్లిసిటీ చేస్తున్నారని పేర్కొన్నారు. దీని కారణంగా ప్రకాశం జిల్లా కందుకూరులో ఎనిమిది మందిని బలిగొన్నారని, గుంటూరులో ముగ్గురు మృతి చెందారని మండిపడ్డారు. కందుకూరు ఘటనకు చంద్రబాబు, లోకేష్, రామోజీరావు, ఎబిఎన్ రాధాకృష్ణ, టివి5 బి.ఆర్ నాయుడును బాధ్యులను చేయాలని డిమాండ్ చేశారు. కానుకలు, చీరలు ఇస్తామని దొంగ మాటలు చెప్పి జనాన్ని రప్పించుకుని, నలుగురికి చీరలు పంచి హడావుడి చేశారని తెలిపారు. దీంతో తొక్కిసలాటలా ముగ్గురు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మరణాలకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. చనిపోయిన మహిళల కుటుంబాలకు చంద్రబాబు ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. బాబు అధికారంలోకి రావడానికి ఎవరెలా పోయినా అవసరం లేదని విమర్శించారు. కందుకూరు, గుంటూరు ఘటనలపై ప్రభుత్వం న్యాయ విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. మున్ముందు ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా బాబు సభలపై నిషేధాజ్ఞలు విధించాలని కోరారు.

ఆర్‌టిసితో సురక్షిత ప్రయాణం

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు
- పలాస-విజయవాడ బస్సు ప్రారంభం

ప్రజాశక్తి - పలాస

ఎపిఎస్ ఆర్టీసీ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాసలోని మంత్రి క్యాంప్ కార్యాలయం ఆవరణంలో పలాస-విజయవాడ హయ్యర్ ఆర్టీసీ బస్సును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమని, ఆర్టీసీని ప్రజలే రక్షించుకోవాలని కోరారు. ఆర్టీసీ డిపో మేనేజర్ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్టీసీ యాజమాన్యం పర్యవేక్షణలో ప్రైవేటు భాగస్వామ్యంతో బస్సు నడుస్తుందన్నారు. బస్సు నిర్వహణ ఖర్చు సంబంధిత కాంట్రాక్టర్ భరించుకుంటారని, కిలోమీటర్‌కు రూ.24 చొప్పున ఆర్టీసీ చెల్లిస్తుందని వివరించారు. బస్సుకు వచ్చిన ఆదాయాన్ని ఆర్టీసీ సంస్థకు చెందుతుందన్నారు. ఈ సందర్భంగా డిపోలో ఉన్న బస్సుల పరిస్థితిని మంత్రి అప్పలరాజు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అప్పలరాజు స్వయంగా బస్సును నడిపారు. కార్యక్రమంలో పలాస, కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ కన్వీనర్ డబ్బిరు భవాని, మున్సిపల్ మాజీ చైర్మన్ కొత పూర్ణచంద్రరావు, కౌన్సిలర్లు పప్పల ప్రసాద్, శర్వాణ రవి, కో-ఆప్షన్ సభ్యులు బి.సంతోష్, డిపో అసిస్టెంట్ మేనేజర్ పి.సంతోష్‌కుమార్, సీనియర్ ట్రాఫిక్ ఆఫీసర్ బి.సుభాష్, నాయకులు పినకాన వాలి, ఎ.డి.కుమార్, బిటివిఎస్.రావు, వై.కె.రావు, జి.శ్రీనివాసరావు, డిసిహెచ్.రావు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి అప్పలరాజు

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సంక్షేమంతో పాటు మౌలిక సదుపాయాల కల్పకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం మండలంలోని సింగుపురం, కిష్టప్పేట, తండ్యాంవలస పంచాయతీల పరిధిలో పలు అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. శ్రీకాకుళం నగరంలోని పిఎన్ కాలనీలో పార్కును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడంతో పాటు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఖరీదైన ప్రభుత్వ స్థలాలు ఖాళీగా ఉంచడం కంటే పార్కులు గానూ ఇతర అవసరాలకు వినియోగించుకోవడం మంచి పరిణామమన్నారు. పెరిగిన నగర అవసరాలకు తగ్గట్లుగా అన్ని ప్రాంతాలకూ తాగునీరు అందించే ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. రిమ్స్‌లో 900 పడకలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వాస్పత్రిపై ప్రజల్లో నమ్మకం పెరగాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి అంబటి నిర్మల, జెడ్‌పిటిసి రుప్ప దివ్య, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేషు, కార్పొరేషన్ల చైర్మన్లు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, వైసిపి నాయకులు దానేటి శ్రీధర్, పైడి రాజారావు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, ఆర్‌అండ్‌బి ఎస్‌ఇ కాంతిమతి, ఇఇ రవినాయక్, డిఇ గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

పింఛన్లు తొలగించవద్దు

- కలెక్టర్‌కు మొర పెట్టుకున్న లబ్ధిదారులు
- 'స్పందన'కు 150 వినతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పలు కారణాలతో పింఛన్లను తొలగించనున్నట్లు నోటీసులు ఇచ్చారని, పింఛను తొలగిస్తే ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటామని పలువురు వృద్ధులు, వికలాంగులు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు మొర పెట్టుకున్నారు. నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి కలెక్టర్ వినతులు స్వీకరించారు. జిల్లావ్యాప్తంగా స్పందన కార్యక్రమానికి 150 వినతులు వచ్చాయి. శతశాతం అంగవైకల్యం ఉన్న వారికి వైకల్యం నిర్ధారించి పెన్షను ఇస్తున్నారని, వెయ్యి ఎస్‌ఎఫ్‌టి ఇళ్లు , కరెంటు బిల్లు వంటి కారణాలు చూపించి పెన్షన్‌ను తొలగిస్తామని నోటీసులు ఇచ్చారని వికలాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు కె.రామారావు, వీరస్వామి వినతిపత్రం అందజేశారు. వైద్యులు ధ్రువీకరించిన అంగవైకల్యం ఆధారంగానే పెన్షన్‌ను కొనసాగించాలని కోరారు. వెయ్యి ఎస్‌ఎఫ్‌టి నిబంధన చూపుతూ పెన్షన్‌ను తొలగించారని, పేదరికంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న తనకు వృద్ధాప్య పెన్షన్‌ను కొనసాగించాలని ఎచ్చెర్ల మండలం దుప్పలవలసకు చెందిన శీర సాంబమూర్తి కోరారు.

పండించిన ధాన్యం కొనే వారు లేక కళ్లాల్లోనే ఉంచాల్సి వస్తోందని పలువురు రైతులు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఆర్‌బికెల వద్ద ధాన్యం ఇస్తుంటే పక్క మండలాల్లోని మిల్లులకు ట్యాగ్ చేసి అక్కడికి తీసుకువెళ్లాలని చెప్తున్నారని మందస, జి.సిగడాం, లావేరు మండలాలకు చెందిన పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో జలకళ ద్వారా సుమారు 250 బోర్లు మంజూరు కాగా, వాటిలో 36 బావులకు విద్యుత్ సరఫరా అనుమతులు మంజూరు చేస్తే నాలుగు మాత్రమే పూర్తి చేశారని పొందూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు కలిశెట్టి అప్పలనాయుడు వివరించారు. జలకళ బోర్లకు పూర్తిస్థాయి అనుమతులు మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలో రైతులు పండించే ధాన్యం మిల్లులకు తరలించడానికి రవాణా సౌకర్యం లేక దళారులకు అమ్మాల్సి వస్తోందని, మరోవైపు తేమ పేరుతో క్వింటాకు ఐదు నుంచి ఎనిమిది శాతం వరకు తొలగించడం వల్ల రైతులు నష్టపోతున్నారని తెలిపారు.

'స్పందన'కు జెడ్‌పి సిఇఒతో కూడిన ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ వెల్లడించారు. జిల్లా అధికారులు లాగిన్‌లోకి వెళ్లి పరిశీలించి పెండింగ్‌లో ఉన్న వాటిని అసైన్‌మెంట్ చేయాలని చెప్పారు. మున్సిపాల్టీ, హోం శాఖ, పంచాయతీరాజ్, డిఆర్‌డిఎ, తదితర శాఖల్లో పెండింగ్‌లో ఉన్న వాటిని పరిష్కరించాలన్నారు. ఆయా శాఖల్లో కారుణ్య నియామకాలకు సంబంధించి ఖాళీల వివరాల డేటా తక్షణమే అందజేయాలని ఆదేశించారు. అర్జీల స్వీకరణలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, జి.జయదేవి పాల్గొన్నారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ నుంచి ఎన్‌ఎస్‌ఎఫ్‌డిసి రూ.16 లక్షల చెక్కులను పది మంది లబ్ధిదారులకు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అందజేశారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కలిశెట్టి అప్పలనాయుడు

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - రణస్థలం

అభివృద్ధి పనులు, పెండింగ్ ఉన్న బిల్డింగ్ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కోష్ట గ్రామ సచివాలయాన్ని ఆయన సందర్శించారు. నిర్మాణంలో ఉన్న రైతు భరోసా కేంద్రం, సచివాలయాలను ఆయన పరిశీలించారు. అనంతరం సచివాలయంలో సిబ్బంది పనితీరును పర్యవేక్షించారు. ప్రభుత్వ స్థలాల పర్యవేక్షణ బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. ధాన్యం కొనుగోళ్ల వివరాలపై ఆరా తీశారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. పేదలందరికీ ఇల్లు పథకం ద్వారా మంజూరైన గృహ నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ధనుంజయరావు, పిఆర్ ఎఇ కూర్మనాథం, హౌసింగ్ ఎఇ మోహన్‌రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రామారావు, సిడిపిఒ ఝాన్సీ, ఎఒ విజయ భాస్కర్, సిఎస్‌డిటి హేమసుందర్, సర్పంచ్ ప్రతినిధి పిసిని లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి హైదర్ అలీ బేగ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సిక్కోలు డ్వాక్రా బజారు ప్రారంభం

శ్రీకాకుళం: నాబార్డు సౌజన్యంతో సిక్కోలు డ్వాక్రా బజారును నగరంలోని ఏడురోడ్ల కూడలి వద్ద గల నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం ప్రారంభించనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల తొమ్మిదో తేదీ వరకు నిర్వహించే డ్వాక్రా బజారు ఉదయం పది నుంచి రాత్రి 9.30 గంటల వరకు తెరిచి ఉంటుందని పేర్కొన్నారు. పొందూరు, సురవరం, జి.సిగడాం ఖాదీ వస్త్రాలు, బ్లాక్ ప్రింటెడ్ చీరలు, మందస ముద్దకోవా, సీతంపేట పసుపు, కొండచీపుర్లు, జీడిపప్పు, చింతపండు, బుడితి ఇత్తడి, కంచు సామాన్లు, సారవకోట చుప్పులు, అప్పడాలు, స్వయం సహాయక బృందాలు తయారు చేసిన పలు వస్తువులను ప్రదర్శించడంతో పాటు విక్రయించనున్నట్లు వివరించారు. జిల్లా ప్రజలు సద్వినియోగించుకోవాలని కోరారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT SRIKAKULAM
E.P.NO.18/2014 IN ARC NO.368/2012

BETWEEN:
Shriram City Union Finance Ltd.
Palasa Branch ...DHR/ Petitioner
AND
M/s. M.S.R. Cashews, Prop. Malla Sadasiva Rao & another ...JDRS / Respondents

JDR 1 : M/s.M.S.R. Cashews, Prop. Malla Sadasiva Rao, S/o Rama murthy, R/o D.No.17-1-45, Reddika Veedhi, Palasa (Vill. / Post / Mdl.), Srikakulam Dist.
JDR 2 : Smt. Malla Rama Devi, W/o Sadasiva Rao, R/o D.No.17-1-45, Reddika Veedhi, Palasa (Vill. / Post / Mdl.), Srikakulam Dist.

వేలం ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ షెడ్యూలు ఆస్థిని పై నెంబరు అవార్డు అమలులో సొమ్ము రాబట్టే నిమిత్తం పైన ఉదహరించిన న్యాయస్థానంలో తేది 27-01-2023 ఉ॥ గం॥ 10-30 ని॥ల నుండి సాయంత్రం 5 గం॥ల మధ్యకాలంలో బహిరంగంగా వేలం వేయబడును. కావున కావలసినవారు ఆ సమయంలో వేలంలో పాల్గొనవచ్చునని ఇందుమూలంగా తెలియపర్చడమైనది.

వేలం ఆస్థి వివరములు :

JDR 1 : Vacant site measuring **East to West : 32.05 feet & North to South 135 feet i.e. 487 1/2 Sq.yards,** covered by **Patta "1", S.No.192/4 of Sasanam (Vill.),** Loddabadra Gram Panchayat, Palasa (Mdl.) with in the SRO Limits of Kasibugga, Srikakulam Dist. Bounded by : **East :** Vacant site of Konchada Narendra & Malla Silpa, **West :** Site of Malla Rama Devi, **South :** Road Leading to Sasanam (Vill.), **North :** Dry Land of Kanithi Lalitha Viswanadham.
Amien Value : Rs.25,00,000/- DHR value : 20,49,061/-,
Hearing Date : 27-01-2023, Further hearing date : 03-02-2023.

N. VIJAYAKUMAR
Advocate for DHR/Petioners, Srikakulam Town & Dist.
Phone : 9440064568, 9849824246, 9704986271

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, SOMPETA, I.A.1/2020 in O.S.45/2016

Between: **S. Vinod Kumar** ...Petitioner
And: **S.PrabhakaraRao** ...Respondents
And others.

NOTICE

R.4: Sakalabhaktula Vikram, s/o Prabakar Rao,Aged 35 years,un-employ ee,Tilak Nagar, KASIBUGGA.

Please take notice that the petitioner filed a petition under Order-1, Rule-10 C.P.C. against you and it stands posted to 06-01-2023 at about 10-30 A.M. in the above court, appear either in person or through your Advocate, failing which the matter will be decided as per law.

K.S.P. BABU,
ADVOCATE, SOMPETA.

IN THE HON'BLE COURT OF THE SENIOR CIVIL JUDGE, SOMPETA. I.A.1/2019 IN I.A.2/2019 IN 0.S.30/2016.

Between:
Bagadi Ananda Rao. ...Petitioner.
And: **Arunodaya Chits & Finance,** Kasibugga rep. by its Foreman, sampatirao Venkata Govinda Rao and others. ...Respondents.

To,
Smt. Sampatirao Mahalakshmi, W/o late Ramarao, household duties. R/o Gandhinagar street, Talagam village, Tekkali post & Mandalam Srikakulam District.

Please take notice that you are the 7th respondent in the above legal heir petitions filed to add you as 7th respondent as the legal heir of deceased Sampatirao Venkata Govinda Rao. You are avoiding to receive the summons even though summons are sent for several times. The above petitions are posted to **06-01-2023 at 10-30 A.M.** for your appearance. Please attend before the Hon'ble Court on that day either in person or through an advocate, failing which the matter will be decided in your absence.
Sompeta,
dated 28-12-2022.

VINAYA C. PATNAIK
ADVOCATE,
SOMPETA

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM. I.A.105/2022 IN O.S.97/2016

Between:
Mosa Raja Babu ...Petitioner/ Plaintiff
And:
Mosa Rama Rao (Died) and others ...Respondent/ Defendants
To
Korada Chandra Kumari w/o late Govinda Rajulu, aged 59 years, Hindu, House hold duties,R/at Door No:2-354, KoradaVeedhi, Srikurmam village, Gara mandalam, Srikakulam district.

నోటీసు

పై నంబెర్ దావా లో, పై తెలిపిన చిరునామా దారు అయిన **కోరాడ చంద్ర కుమారి,** పై దావా లోని చని పోయిన 8వ ప్రతివాది **కోరాడ గోవిందరాజులు @ గోవింద్** గారి ముఖ్య వారసురాలై వున్నారు. అందులకు వారి మిమ్ములను పై దావాలో 9 వ ప్రతివాదిగా చేర్చే నిమిత్తం IA:**105/2022** ఇన్ OS: **97/2016** వేసి, మీ పై ఎన్ని మార్లు సమను జారీ చేసినా ప్రతిస్పందించ నందుకు కోర్ట్ వారి ఆర్డర్ ప్రకారము ఈ ప్రకటన జారీ చేయుచున్నారు. పై విషయమయి మీ ఆక్షేపణలు తెలియ చేయుటకు, మీరు మహారాజశ్రీ శ్రీకాకుళం ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ **JUDGE** కోర్ట్ వారి ఎదుట **తేదీ.04-01-2023** ఖుద్దున గానీ, వకీలు ద్వారా గాని హాజరై మీ అక్షేపణలు తెలియ చేయ గలరు. లేనిచో మీ పరోక్షమున తీర్పు చేయగలరు.

ఇప్పిలి సీతరాజు
అడ్వకేట్
సెల్: **9989557694**


7న జిల్లాస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలు

ప్రజాశక్తి- పలాస

పలాస గవర్నమెంట్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 7న జిల్లా స్థాయి సీనియర్, జూనియర్, సబ్-జూనియర్ ఛాంపియన్-షిప్ క్రీడాపోటీలు జరగనున్నాయని స్టీఫెన్ హాకింగ్ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు టి.రాము, సెక్రటరీ డి.అచ్యుతరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.తవిటయ్య, అథ్లెటిక్స్ కోచ్ కె.రామారావు తెలిపారు. ఈ పోటీలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా వారు పాల్గొనవచ్చని చెప్పారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడా కారులు రాష్ట్ర స్థాయి పారా అథ్లెటిక్స్ ఛాంపియన్-షిప్-2022కు ఎంపిక అవుతారని, అనంతరం జనవరి, ఫిబ్రవరిలో గుజరాత్, మహారాష్ట్రలో జరగబోయే జాతీయస్థాయి సీనియర్, జూనియర్, సబ్-జూనియర్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్-షిప్ క్రీడాపోటీ ఎంపికలకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్వహిస్తున్న 5వ సీనియర్, మూడోవ రాష్ట్ర స్థాయి జూనియర్, సబ్-జూనియర్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్-2022 క్రీడాపోటీల ఎంపిక అవుతారని చెప్పారు. క్రీడల్లో పాల్గొనేందుకు ఈ నెల 5వ తేదీలోగా పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్ కోసం 9381368209, 6302909518 నెంబర్లను సంప్రదించాలన్నారు.

చెస్‌తో క్రమశిక్షణ అలవడుతుంది

శ్రీకాకుళం అర్బన్ : క్రీడా పోటీల్లో విరివిగా పాల్గొంటేనే ఆయా క్రీడల్లో రాణింపు ఉంటుందని, చదరంగంతో క్రమశిక్షణ అలవడుతుందని సంజీవయ్య మెమోరియల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ గంజి ఆర్.ఎజ్రా పేర్కొన్నారు. నగరంలోని స్కూల్ ఆఫ్ చెస్ ఆకాడమీలో సోమవారం చెస్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభించారు. వివిధ ప్రాంతాల్లోని చిన్నారులు పాల్గొని ఐదు రౌండ్ల పాటు చెస్ పోటీలు నిర్వహించారు. బాల బాలికల్లో విజేతలుగా మంగరాజు శేషాద్రి ప్రథమ స్థానం అంధవరపు సుహాస్, అంధవరపు జోషిక్ 2, 3 స్థానాలను కైవసం చేసుకున్నారు. తరువాత స్థానాల్లో మొసలికంటి కృష్ణకుషాల్, బలివాడ జయంత్, శిల్లా రామ హర్షిత్, కరుణాకరన్ నిశ్చల్, అందవరపు సాత్విక్, ఎన్.గగన్స్, ఎన్.వేదష విజేతలుగా నిలిచారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ చెస్ ఆకాడమీ కోచ్ భేరి చిన్నారావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

చంద్రబాబుది బాధ్యతారాహిత్యం

ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

లావేరు : గుంటూరులో ఆదివారం తెలుగుదేశం పార్టీ కానుకల పంపిణీలో జరిగిన తొక్కిసలాటలో ముగ్గురు అమాయక మహిళలు మృతి చెందడం విచారకరమని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని తాళ్లవలస పంచాయతీ రావివలసలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. నెల్లూరులో జరిగిన ఇదే తరహా ఘటనలో ఎనిమిది మంది మృతి చెందగా, తర్వాత మూడు రోజులకే ఈ ఘటన చోటు చేసుకోవడం బాధాకరమని అన్నారు. చంద్రబాబు తన కార్యక్రమాలకు పెద్దసంఖ్యలో ప్రజలు హాజరయ్యారని చూపించడానికి ఇరుకు సందుల్లో రోడ్ షోలు, బహిరంగ సభలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం వల్లే తొక్కిసలాటలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఈ ఘటనలపై పూర్తి బాధ్యత చంద్రబాబు వహించాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కోసం అమాయకులను బలితీసుకున్నారని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

సిఎం మాట నిలబెట్టుకున్నారు



జలుమూరు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి- జలుమూరు

ఎన్నికల సమయంలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పింఛను లబ్ధిదారులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. చల్లవానిపేటలోని ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన నూతన పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛను లబ్ధిదారులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మూడో విడుదల రూ.250 పెంచి జనవరిలో మొత్తం రూ.2,750 అందజేస్తున్నారని అన్నారు. మాట తప్పని నాయకుడు జగన్‌కు మీరంతా అండగా నిలిచి, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసి మళ్లీ సిఎంను చేయాలని కోరారు. ముందుగా జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పెన్షనర్లతో కలిసి ఎమ్మెల్యే క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి వాన గోపి, వైసిపి మండల కన్వీనరు మొజ్జాడ శ్యామలరావు, వైస్ ఎంపిపి తంగి మురళీకష్ణ, మండల సలహాదారుడు పైడి విఠల్‌రావు, చల్లవానిపేట పిఎసిఎస్ చైర్‌పర్సన్ పాగోటి రాజప్పలనాయుడు, దామ మన్మథరావు, ఎంపిడిఒ జివి.రవికుమార్, ఎ.దామోదరరావు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలోని 12, 13, 3వ వార్డుల్లో కొత్తగా మంజూరైన వైఎస్ఆర్ పెన్షన్లను చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి పంపిణీ చేశారు. 3వ వార్డులో 4 కొత్త పెన్షన్‌లు, 12, 13 వార్డుల్లో 11 పెన్షన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ సిఎం జగనన్న సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అర్హతగల లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నల్లి రమేష్, కౌన్సిలర్ ప్రతినిధి బుడుపు త్రినాథ్, 3వ వార్డ్ నుండి కౌన్సిలర్ పత్తి తవితయ్య, కో-ఆప్షన్ మెంబెర్ సాలీనా ఢిల్లీ, సచివాలయ సిబ్బంది, వాంటీర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కొత్త పింఛన్లతో లబ్ధిదారులుల్లో ఉత్సాహం వస్తుందని వైసిపి 20వ వార్డ్ కౌన్సెలర్ తాడి ఆది రెడ్డి అన్నారు. రత్తకన్న గ్రామంలో అర్హులైన కొత్త లబ్ధిదారులకు పింఛను మంజూరు కావడంతో పార్టీ అదేశాలు ప్రకారం వార్డు కౌన్సిలర్ స్వయంగా వాలంటీరుతో ఇంటికి వెళ్లి పింఛన్ల పంపిణీ చేశారు. కొత్తగా తొమ్మిది మందికి పింఛన్లు మంజూరయ్యాయి. 21 వార్డులో టిడిపి కౌన్సిరల్ ప్రతినిధి కాళ్ల జయదేవ్ వార్డులో కొత్త పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: పింఛన్లు పంపిణీ చేస్తున్న రాజ్యలక్ష్మి

టెక్కలి రూరల్: కొఇుసుల కొత్తూరు పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ మొర్రి శంకరరావు పింఛన్లను, రైతులకు పాస్ పుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంటికీ కుళాయి, అమ్మవారి గుడికి రోడ్డు నిర్మాణం చేయాలని కల కనేవాడినని, అవి నెరవేరనున్నాయని చెప్పారు. సంక్రాంతి పోయిన వెంటనే రోడ్డు నిర్మాణం చేపడతామని తెలిపారు. చాకిపల్లి ఎంపిటిసి పి.శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ దల్లి సుభద్ర, పంచాయతీ కార్యదర్శి చంద్రరావు, విఆర్ఒ ఎం.జానకి మోహన్, జల్ల సత్యం, రేయమ్మ, కె.చిన్నమ్మి, ధర్మాన ప్రకాశరావు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ పథకాలు

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- బూర్జ

ప్రతి పేదవాడూ ఉన్నతస్థాయిలో ఉండాలనే లక్ష్యంతో సిఎం జగన్మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. బూర్జ సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందులో భాగంగా ఈ నెల నుంచి రూ.2,750 పింఛను పెంచామని పేర్కొన్నారు. ఎటువంటి సిఫార్సులు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే డబ్బులు జమవుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కర్నేన నాగేశ్వరరావు, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, అవుట్ సోర్సింగ్ రాష్ట్ర డైరెక్టర్ కండాపు గోవిందరావు, వైస్ ఎంపిపిలు బుడుమురు సూర్యారావు, కరణం కృష్ణంనాయుడు, డిసిఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాంనాయుడు. సర్పంచ్ ఏగు అనురాధ పాల్గొన్నారు.



బూర్జ : మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

రావివలసలో...

లావేరు : మండలంలోని తాళ్లవలస పంచాయతీ రావివలస, బొడ్డపాడు గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యాక్రమాన్ని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. అనంతరం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, సర్పంచ్ బంకుపల్లి సీతమ్మ, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వి.విశేశ్వరరావు, ఎపిఎం మాఊరు మాధవీలత పాల్గొన్నారు.

పెన్షనర్లకు మరిన్ని సేవలు

ప్రజాశక్తి- టెక్కలి

విశ్రాంత ఉద్యోగుల సంక్షేమార్థం వారికి మరిన్ని సేవలు విస్తరించనున్నామని ఆ సంఘ అధ్యక్షులు రోణంకి రామచంద్రరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెక్కలి సబ్ ట్రెజరీ పరిధిలోని టెక్కలి, సంతబొమ్మాళి, నందిగాం మండలాలకు చెందిన సుమారు 1200 మంది పెన్షనర్లకు సర్వీసులు అందజేయనున్నామని తెలిపారు. విశ్రాంత ఉద్యోగి తన పింఛను సమయంలో లైఫ్ సర్టిఫికెట్ గతంలో ట్రెజరీ ద్వారా అందజేయబడేవని, ఇప్పుడు ఆన్‌లైన్‌లో సంఘం కార్యాలయం ద్వారా అందించవచ్చని పేర్కొన్నారు. ఈ సేవలు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఈ సేవలను విశ్రాంత ఉద్యోగులు సద్వినియోగించుకోవాలని కోరారు.

ఎస్‌పి 'స్పందన'కు 24 అర్జీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

స్పందనలో వచ్చే ఫిర్యాదులను పరిష్కరించడంలో జాప్యం ఉండరాదుని, అర్జీలకు ప్రాధాన్యత ఇచ్చి నిర్ణీత సమయంలోగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్‌పి జి.ఆర్.రాధిక పోలీస్ అధికారులకు ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఎస్‌పితో పాటు అదనపు ఎస్‌పి టి.పి.విఠలేశ్వరరావు వినతులను స్వీకరించారు. ఈ మేరకు 24 మంది ఫిర్యాదారులు తమ తమ అభ్యర్థనలను రాతపూర్వకంగా విన్నవించారు. అనంతరం ఎస్‌పి ఫిర్యాదుదారులతో ముఖాముఖి నిర్వహించారు. కుటుంబ తగదాలకు సంబంధించినవి మూడు, సివిల్ నాలుగు, ఆస్తి తగాదాలు నాలుగు, పాత ఫిర్యాదులు ఆరు, ఇతరులు ఏడు పిర్యాదులు వచ్చాయి. ఈ ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని, ఆ నివేదికలను ఎప్పటికప్పుడు జిల్లా ఎస్‌పి కార్యాలయానికి అందజేయాలని ఆదేశించారు.



ఫిర్యాదుదారునితో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక



సత్తిబాబు మృతదేహం

ఆటో ఢీకొని వ్యక్తి దుర్మరణం

కోటబొమ్మాళి : స్థానిక ఎస్‌బిఐ ఎదురుగా సోమవారం ఆటో ఢీకొని వ్యక్తి మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు... కోటబొమ్మాళి ప్రకాష్‌నగర్ కాలనీకి చెందిన నౌడప సత్తిబాబు (57) బ్యాంకుకు సంబంధించి విత్ డ్రా తదితర ఫారాలు నింపుకుని ఖాతాదారులు ఇచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. పనులు ముగించుకుని రోడ్డు దాటుకుని ఇంటికి వెళ్తుండగా... కోటబొమ్మాళి నుంచి వెళ్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో సత్తిబాబు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. ఈయన గతంలో విలేకరిగా పనిచేశారు. మృతుడికి భార్య సోమేశ్వరి, కుమార్తె ఉన్నారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఎస్ఐ ఖాదర్ బాష కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి

ఎచ్చెర్ల : అనారోగ్యంతో ఎఆర్ కానిస్టేబుల్ గురుగుబెల్లి చుక్కారావు (50) సోమవారం మృతి చెందారు. పది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తుదిశ్వాస విడిచారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. స్వగ్రామం ఎచ్చెర్ల మండలం కొత్తపేట కాగా, కొన్నేళ్లుగా ఎఎస్‌టి నగర్‌లో నివాసం ఉంటున్నారు. కానిస్టేబుల్ మృతితో సహచర సిబ్బంది దిగ్భ్రాంతికి గురయ్యారు.

రంగస్థల కళాకారుడు...

బూర్జ : మండలంలోని మదనాపు రానికి చెందిన అడపా అప్పలనాయుడు (80) అనే రంగస్థల కళాకారుడు అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆయన జానపద, పౌరాణిక రంగస్థలాల్లో మాయల ఫకీరు, విస్వామిత్ర, కాల కౌశిక, వీరబాహు వంటి అనేక పాత్రలను పోషించి ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నారు. ఆయన మృతితో కళాకారులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.



అప్పలనాయుడు (ఫైల్)



చక్రపాణి కుటుంబాన్ని పరామర్శించిన శివాజీ, శిరీష

చక్రపాణి మృతి తీరని లోటు

ప్రజాశక్తి- పలాస

మందస మండలం వి.జి.పురానికి చెందిన చక్రపాణి మృతి పార్టీకి తీరనిలోటు అని, పిన్న వయస్సులో ఆయన మరణం బాధాకరమని మాజీ మంత్రి గౌతు శివాజీ, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. పార్టీలో ఎంతో చురుకైన పాత్ర పోషిస్తున్న చక్రపాణి ఇక లేరన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చక్రపాణి మరణ విర్త తెలుసుకున్న శిరీష, శివాజీ సోమవారం మృతుని కుటుంబసభ్యులను కలిసి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం జిల్లుండ, హరిపురంలో మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించి, సంతాపం తెలిపారు. వారి వెంట జికె.నాయుడు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, దాసరి తాతారావు, లబ్బ రుద్రయ్య, రట్టి లింగరాజు, తమ్మినేని ధనుంజయ, మండల లచ్చయ్య, ముడిమించి నవీన్, బొత్తుక మోహనరావు, గుంట నారాయణ, తదితరులు ఉన్నారు.



ప్రదర్శనను పరిశీలిస్తున్న రామ్‌మనోహర్‌నాయుడు

'వైభవ్'లో ఎలైట్ సంబరాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా ప్రజలకు అందుబాటులో ఉన్న వైభవ్ జ్యూయలర్స్‌లో ఎలైట్ కలెక్షన్ ప్రదర్శన, అమ్మకాల సంబరాలు నిర్వహించడం ఆనందంగా ఉందని వైసిపి నాయకులు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, సుశ్రీ దంపతులు పేర్కొన్నారు. ఈ మేరకు ఎలైట్ సంబరాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆకర్షణీయమైన డిజైన్లతో వర్ణాభరణాల ప్రదర్శన, అమ్మకాలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కొనుగోలుదారులను ఎలైట్ కలెక్షన్, స్వర్ణభరణాలు ఆకర్షిస్తాయని అన్నారు. వైభవ్ బ్రాంచ్ మేనేజర్ కె.నేతాజీ మాట్లాడుతూ ఈ నెల 10 వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మండవిల్లి రవి, వ్యాపారవేత్తలు మండవిల్లి రమేష్, ఎ.వి.రమేష్, లయన్స్‌క్లబ్ రీజనల్ చైర్మన్ నటుకుల మోహన్, కె.సీజు, అంధవరపు స్నేహ, రమాదేవి, దీపారాణి, పి.అరుణశ్రీ, ఎబిఎం దవళ ప్రభాకరరావు పాల్గొన్నారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఇఒ రామరాజు

డిటిఎఫ్ కేలండరు ఆవిష్కరణ

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు ఎంఆర్‌సి కార్యాలయంలో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ కేలండర్‌ను ఎంఇఒ పి.వి.రామరాజు, తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు లఖినాన హేమనాచార్యులు సోమవారం కేలండర్లను ఆవిష్కరించారు. అనంతరం డిటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి సీపాన భాస్కరరావు, మండల బాధ్యులు గండెం రామారావు, జి.రాజు, జి.భాస్కరరావు కేలండర్లు, డైరీలను మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పూజారి హరిప్రసన్న, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గురుగుబెల్లి గోపాలరావు, వేణు గోపాలరావు, గోవిందరావు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం



శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ గిరిబాబు

పలాస: మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా పని చేస్తున్నామని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 21వ వార్డు శారదానగర్‌లో 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.16 లక్షలతో నూతన రహదారి పనులకు ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా వార్డులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రతి వార్డులోనూ రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నామన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు పప్పల ప్రసాద్, సనపల సింహాచలం, అంబటి ఆనంద్, మాజీ కౌన్సిలర్ రోణంకి శాంతి కుమారి, వైసిపి నాయకులు కార్యకర్తలు వార్డ్ ప్రజలుపాల్గొన్నారు.

'సోషల్ రెస్పాన్సిబులిటీ' ఆర్గనైజేషన్‌కు ప్రశంసలు

ఇచ్ఛాపురం : మూడేళ్ళుగా ఇచ్ఛాపురం పట్టణం, పరిసర ప్రాంతాలలో అనారోగ్యంతో బాధపడే పేదవారికి వైద్య ఖర్చుల కోసం సాయం చేయడం, నిరాశ్రయ వృద్ధుల ఆకలి తీర్చేందుకు 2022 జనవరి 2వ తేదీ నుంచి లంచ్ బాక్స్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్న సోషల్ రెస్పాన్సిబులిటీ సంస్థను పలువురు ప్రశంసిస్తున్నారు. లంచ్ బాక్స్ కార్యక్రమం ప్రారంభించి సోమవారానికి ఏడాది పూర్తయిన సందర్భంగా ఇచ్ఛాపురం బస్టాండులో మధ్యాహ్నం నారాయణ సేవ(అన్నప్రసాద వితరణ)ను భారీ ఎత్తున నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రూరల్ ఎస్ఐ రామకృష్ణ సేవా కార్యక్రమాలతో అందరి మన్ననలు పొందారని అన్నారు. అనంతరం కస్తూరి బా గాంధీ బాలికల విద్యాలయంలో బాలికలకు రూరల్ ఎస్ఐ మానసిక వికాసం పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రూరల్ ఈచ్‌సి. రామారావు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



పుస్తకాలను అందజేస్తున్న ఎస్ఐ రామకృష్ణ

'ఉపాధి'తో వలసల నివారణ

కవిటి: వలసల నివారణే ప్రథమ లక్ష్యంగా ఉపాధి హామీ పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ పూడి లక్ష్మణరావు తెలిపారు. మండలంలోని చిన్న ఎర్రగోవిందపుట్టుగ, పెద్ద ఎర్రగోవిందపుట్టుగ గ్రామాల్లో సోమవారం ఉపాధి హామీ పనులు ప్రారంభించి, ఉపాధి కూలీలకు జాబ్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం పూర్తిస్థాయిలో, అవసరమైన అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. స్థానికులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిటిసి శంకర్ ప్రధాన్, దుర్యోధన, బెన్ను, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళిక ముఖ్యం



నౌపడ : మాట్లాడుతున్న సర్పంచ్ గోవిందరావు

నౌపడ: సంతబొమ్మాళి మండలం చిన్నతుంగాం లో నిర్వహించిన గ్రామసభలో సోమవారం గ్రామ అభివృద్ధిపై ప్రణాళికలు రూపొందించారు. పంచాయతీ సర్పంచ్ సిమ్మ గోవిందరావు, పంచాయతీ కార్యదర్శి డి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీలో చేపట్టబోయే అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరుపై చర్చించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూర్చే విధంగా సమన్వయంతో పనిచేయాలని సచివాలయ సిబ్బందికి, వాలంటీర్లకు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్, కెసిఎస్ శ్రీనివాసులు, గ్రామ పెద్దలు జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: పంచాయతీ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించి ఈ ఏడాది చేపట్టబోయే పనులపై ప్రణాలిక తయారు చేయాలని ఆయోధ్యాపురం సర్పంచ్ బగాది హరి అన్నారు. సోమవారం సచివాలయ ఉద్యోగులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు పన్నులు ఏ మేరకు వసూలు కాబడ్డాయి. అభివృద్ధి పరంగా చేపట్టబోయే పనులు ఏమిటి అనేదానిపై గ్రామసభ నిర్వహించారు. దువ్వాడ శ్రీనివాస్, అట్ల సరోజనమ్మ, దువ్వాడ వాణి సహకారంతో నిధులు కేటాయింపునకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. వైసిపి నాయకులు బగాది మాధవరావు, దువ్వాడ లక్ష్మీనారాయణ, బి.సింహాచలం, తవుడు పాల్గొన్నారు.

ట్యాబ్‌ల పంపిణీ



పలాస : విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న గిరిబాబు

పలాస: రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో సఫలీకృతమయ్యారని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. కాశీబుగ్గ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. అనంతరం 24వ వార్డులో పెంచిన పింఛను డబ్బులను సోమవారం పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యకు పెద్దపేట వేస్తున్నారని, నాడు నేడు కింద కోట్లాది రూపాయలు విచించి అభివద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బల్ల ఉషా, కౌన్సిలర్‌లు పి.ప్రసాద్, బి.శ్రీనివాసరావు, బల్ల శ్రీనివాసరావు, పాఠశాలల హెచ్ఎం, ఉపాధ్యాయులు, సచివాలయం ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

బూర్జ: విద్యా రంగంలో ప్రభుత్వం పెను మార్పులు తీసుకొస్తుందని ఎంపిపి కర్నేన దీప అన్నారు. మండలంలోని కొల్లివలస డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ట్యాబ్‌లను వినియోగించుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. జెడ్‌పిటిసి బెజ్జిపురం రామారావు మాట్లాడుతూ విద్య పేదరికానికి అడ్డు రాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాల కల్పన, సంక్షేమ పథకాలు అమలు ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి బుడుమూరు సూర్యారావు, ప్రిన్సిపాల్ నూక రామకృష్ణ, సర్పంచ్‌లు జి.డి.వేణు, బూరి శ్రీరాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నందిగాం: మండలంలోని మధనాపురం కెజిబివిలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎపి రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. సోమవారం ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తితో కలిసి మధనాపురం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఎస్ఓ రమ్యను అడిగి తెలుసుకున్నారు. మండల పరిషత్ నిధుల నుంచి బోరు ఏర్పాటుకు ఎంపిపితో కలిసి భూమి పూజ చేశారు. పాఠశాలలో అమలు జరుగుతున్న మెనూను, వంటలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకష్ణారావు, వైస్ ఎంపీపీలు సువ్వారి వసంత కుమార్, ఆర్. కూర్మనాయకులు,మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు శ్యాంసుందర్రావు, సర్పంచులు మడపాల తిరుపతిరావు, మడపాల సంజీవరావు తమిరె దేవేందర్రావు, పుష్య సత్యం, బార్నాన బాబురావు, ఎంపీటీసీ ప్రతినిధి ఆనంద్, కరుకోల రామకష్ణ, జోగారావు, పోలయ్య,తదితరులు పాల్గొన్నారు.



బూర్జ : ట్యాబ్‌లను అందజేస్తున్న ఎంపిపి దీప



నందిగాం : ట్యాబ్‌లతో విద్యార్థులు

ప్రభుత్వ కార్యాలయాల్లో కొత్త సంవత్సర వేడుకలు



శుభాకాంక్షలు తెలుపుతున్న నర్సింగ్ సిబ్బంది

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా వ్యాప్తంగా ఆదివారం ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు కావడంతో కొత్త సంవత్సర వేడుకలను సోమవారం నిర్వహించుకున్నారు. కార్యాలయాల్లో ఉన్నతాధికారులకు పూల బొకేలు, స్వీట్లు, ఫలాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. రిమ్స్ వైద్య కళాశాల, సర్వజనాస్పత్రిలో వేడుకలు నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపాల్, మెడికల్ సూపరింటెండెంట్, ఆర్ఎంఒ, వివిధ విభాగాల అధికారులను నర్సింగ్ సిబ్బంది, విద్యార్థినులు మర్యాద పూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. అలాగే విద్యుత్‌శాఖ సర్కిల్ కార్యాలయంలో ఎస్ఇ దైవ కుమార్‌ను 1104 యూనియన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కలెక్టరేట్, పంచాయతీరాజ్, జెడ్‌పి, వంశధార, నీటిపారుదలశాఖ కార్యాలయాల్లో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

మోహన్‌కు సన్మానం

శ్రీకాకుళం అర్బన్ : నగరానికి చెందిన డాక్టర్ గుండబాల మోహన్‌ను తెలగ సంక్షేమ సంఘం భవనంలో జిల్లా అధ్యక్షులు రొక్కం సూర్యప్రకాష్ దుశ్శాలువ కప్పి సోమవారం సన్మానించారు. వ్యాయామ విద్యలో ఆయనకు ప్రపంచ స్థాయి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో పేరు నమోదు కావడంతో ఈ సన్మానం నిర్వహించారు. ఆయన నిత్య విద్యార్థిగా కొనసాగుతున్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు టి.రాజేంద్ర దాస్, ఇ.జనార్ధన్, కె.నారాయణరావు, వై.వెంకటరమణ, కె.వెంకటేశ్వరరావు, వి.శ్యామ్, కె.శభూషణ్, పి.దుర్గాప్రసాద్, పి.కృష్ణారావు, ఎం.సత్యనారాయణ, పిల్లల నీలాద్రి, డి.అప్పారావు పాల్గొన్నారు.

అలరించిన గాత్ర కచేరి

ప్రజాశక్తి- కవిటి

ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్థానిక రఘునాథస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన కర్ణాటక శాస్త్రీయ సంగీత గాత్ర కచేరి ఆహూతులను అలరించింది. సత్యానంద రౌలో గాత్రానికి అట్టాడ కవిరాజు మృదంగం, సంపత్ రెడ్డి వయోలిన్, బంకుపల్లి దుర్గా శ్రీనివాస్ శర్మ మోర్ సింగ్ జత కలవడంతో గాత్ర కచేరి శ్రోతలను మంత్రముగ్దులను చేసింది. మరోవైపు ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండలంలోని వైష్ణవ ఆలయాల్లో వేకువజామునుంచే యాత్రికులు బారులు తీరారు. మండలంలోని బెజ్జిపుట్టుగ గ్రామంలోని శ్రీ చక్ర పెరుమాల్ స్వామి ఆలయం, కవిటి రఘునాథస్వామి ఆలయం, లోళ్లపుట్టుగ కల్యాణ వేంకటేశ్వర ఆలయం, ప్రగడపుట్టుగ రామాలయాలు యాత్రికులతో కిటకిటలాడాయి. స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ పై ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బెందాళం రమేష్, ఆరంగి త్రివిక్రమరావు, బెందాళం విజయ్, ఆరంగి రామ్‌కుమార్, బార్ల చినబాబు, యర్ర బాసుదేవ్ ప్రధాన్, బల్లెడ శంకరరావు, బెందాళం సురేష్, బల్లెడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: వైకుంఠ ఏకాదశి సందర్భంగా సోమవారం ఉత్తర ద్వార దర్శనం కోసం యాత్రికులు వేకువ జామున నుండి బారులు తీరారు. పట్టణంలోని గిలాయ్ వీధిలో ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, గ్రామ దేవత శ్రీ స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో ఉన్న ఉప ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత వెంటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు..సోమవారం కావడంతో శివాలయంలో స్వామి దర్శనం కోసం యాత్రికులు తరలివచ్చారు.



దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న ఎమ్మెల్యే అశోక్

అరసవల్లిలో వైకుంఠ ఏకాదశి వేడుకలు



ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న అర్చకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు సోమవారం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యాన అశ్వ వాహనంపై వేకువజామున నగరంలో తిరువీధి మహోత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవ విగ్రహాల ను ఊరేగించిన అనంతరం ఉత్తర ద్వార ప్రవేశం సాంప్రదాయ బద్ధంగా చేపట్టారు. ఆ తిరువీధి మహోత్సవం నిర్వహించారు. అనంతరం ఉషా పద్మిని ఛాయా సమేత సూర్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు.

విరాళాలు

ఆలయంలో చేపడుతున్న నిత్యాన్నదాన పథకానికి తన వంతుగా అరసవల్లికి చెందిన పల్లి రాజ్యలక్ష్మి రూ. 1,01,116 విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్‌కు అందజేశారు. అలాగే కె.పి. నాయుడు ఆలయంలో యాత్రికుల అవసరార్థం రూ. 18,500 విలువైన ఎయిర్ ప్యూరిఫైయర్‌ను అందజేశారు.

వైభవంగా ఆదిత్యుని కళ్యాణం

సూర్యనారాయణ స్వామి వారి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని అనివేటి మండపంలో పుష్య శుద్ధ ఏకాదశిని (వైకుంఠ ఏకాదశి/ముక్కోటి ఏకాదశి)ని పురస్కరించుకుని ఈ కళ్యాణం నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఇఒ వి.హరిసూర్యప్రకాష్ పాల్గొన్నారు.

కేంద్ర ఉన్నతాధికారి సందర్శన

న్యూ ఢిల్లీకి చెందిన కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారి రాజేష్‌కుమార్ పాఠక్ సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతించారు. స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం ఆయనకు శేషవస్త్రాలను కప్పి జ్ఞాపికను అందజేశారు.

ఆమదాలవలస పట్టణంలోని వెంకటేశ్వర లక్ష్మీనరసింహ, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి సందర్భంగా మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామ్, గుడ్లబాబు, బొడ్డేపల్లి విజయ్, కూన జోగారావు, ఊన్న రమేష్ దర్శించుకున్నారు.

పుస్తకాలు వితరణ



పుస్తకాలు అందజేస్తున్న మీనాక్షి

రణస్థలం: రణస్థలం శాఖాగ్రంథాలయానికి స్థానిక బిసి హాస్టల్ వార్డెన్ మీనాక్షి విద్యార్థులకు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను సోమవారం వితరణగా అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఎస్ సిజిడి, జనరల్ సైన్స్ అండ్ టెక్నాలజీ, హైటెక్ విజయ రహస్యాలు జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు అందజేశామని పేర్కొన్నారు. చాలా మంది నిరుద్యోగులు పుస్తకాలు కొనుక్కుని చదువుకోవడానికి ఇబ్బంది పడేవారు గ్రంథాలయానికి వస్తారనే ఉద్దేశంతో ఈ పుస్తకాలను అందజేశామని అన్నారు. నిరుద్యోగ యువతీ యువత గ్రంథాలయానికి వచ్చి చదువుకోవాలని పిలుపునిచ్చారు. గ్రంథాలయ అధికారి పి.వరలక్ష్మి మాట్లాడుతూ పుస్తకాలు అందించడం అభినందనీయమన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదువుకొని పోటీ పరీక్షల్లో విజయం సాధించి ఉద్యోగస్తులు కావాలని పిలుపునిచ్చారు.

ఎమ్మిగనూరు ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికాదు

శ్రీకాకుళం అర్బన్ : కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు శాసనసభ్యులు చెన్నకేశవ రెడ్డి భూ హక్కు పత్రాల పంపిణీలో గ్రామ పరిపాలనా వ్యవస్థలో కీలకంగా ఉన్న విఆర్ఒ, విఆర్ఎలను అవమానపరుస్తూ మాట్లాడం దారుణమని విఆర్ఒల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.రమేష్‌కుమార్, ఆర్.ప్రసాద్‌లు ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ వ్యవస్థకు ఆధారం, మూల స్తంభాలైన విఆర్ఒ, విఆర్ఎల వ్యవస్థలను కించ పరుస్తూ మాట్లాడడం తగదన్నారు. రెవెన్యూలో కొంతమంది అవినీతి చేస్తే అందరూ అవినీతి పరులే అని అనడం ఎంతవరకు సమంజసం కాదన్నారు. ప్రజా ప్రతి నిధులు, అధికారులు గ్రామాలకు వస్తే వారిని ఆదరించేది విఆర్ఒ, విఆర్ఎలేనని గుర్తు చేశారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లేది ఈ వ్యవస్థేనని అన్నారు. లేకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

చిన్నారి వైద్య ఖర్చులకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

ప్రజాశక్తి- పలాస

మండలంలోని పెద్ద సున్నాదేవి గ్రామానికి చెందిన రామారావుకు మూడు నెలల పాప ఉంది. పాపకు బ్రెయిన్‌లో రక్తం గడ్డ కట్టుకుపోవడం వల్ల పలు ఆస్పత్రులకు తిరిగారు. చివరకు రూ.6 లక్షలతో శ్రీకాకుళంలోని ఓ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించారు. రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబం కావడంతో అంత మొత్తం అప్పు చేసి తెచ్చాడు. కూలి పని చేయగా వచ్చిన డబ్బులు పాప వైద్యానికీ, అప్పులకే చాలడం లేదు. ఇల్లు గడవటం కష్టంగా ఉంది. రామారావు ధీన పరిస్థితిని తెలుసుకున్న శ్రీ పవనపుత్ర సేవా సంస్థ సభ్యులు వైద్య ఖర్చుల కోసం రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. పాపకు ప్రతినెలా అవసరమైన ప్లాస్మాను సేవా సంస్థ ద్వారా అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు మజ్జి భాస్కరరావు, అధ్యక్షులు కొల్లి ఫాల్గుణరావు, ట్రెజరర్ హనుమంతు జనార్ధన్, జాయింట్ సెక్రటరీ రుంకు తరకేశ్వరరావు, నందిగాం మండలం కో-ఆర్డినేటర్ రామారావు, గోరకల కుమార్, గ్రామస్తులు పాల్గున్నారు.

నిరుపేద కుటుంబానికి అండగా..

కష్టం చెబితే చాలు ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నామని వాసవి సేవా సమితి కన్వీనర్ కోట్నీ విజయ్ అన్నారు. కాశీబుగ్గ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆమదాలవలసకు చెందిన అంధవరపు గోవిందరావు కుమార్తె పెళ్లికి దాతల సహకారంతో రూ.74 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సునీత ఎంటప్రైజెస్ యజమాని పెంట శ్రీను పెళ్లికూతురు సారికి అవసరమైన చీర, ఇత్తడి సామాన్లు, స్టీల్ సామానులు అందజేశారు. ఈ సందర్భంగా వ్రాసవి సేవా సమితి కన్వీనర్ కోట్నీ విజయ్ మాట్లాడుతూ కష్టాల్లో ఉన్నామని ఎవరైనా తమకు తెలియజేస్తే ఏ సమయంలోనైనా ఆదుకునేందుకు సిద్ధంగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో కె.వి గోపాల్, కోట్నీ విజయ్, కె.రమేష్, పెంట ఉదయశంకర్, బరాటం కాశి, పెంట రత్నాకర్, పెంట శ్రీను, టి.హరి, తదితరులు పాల్గొన్నారు.



దుస్తులను అందజేస్తున్న బిగ్‌హెల్ప్ ప్రతినిధులు

పాఠశాల విద్యార్థులకు సహకారం

టెక్కలి: మండలంలోని తలగాం ఎట్ నౌపడా ఆర్ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులకు బిగ్‌హెల్ప్ అసోసియేషన్ ద్వారా సోమవారం సహకారం ఆందించామని డైరెక్టర్ రామముని రమేష్‌కుమార్ తెలిపారు. పాఠశాల్లో విద్యను అభ్యసిస్తున్న 15 మంది పేద విద్యార్థులకు అసోసియేషన్ ద్వారా రూ.12వేలు విలువైన నూతన వస్త్రాలు అందించామని తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం ఎ.ధర్మారావు మాట్లాడుతూ దాతల సహకారం సంస్థలకు ఉండాలని కోరారు. బిగ్‌హెల్ప్ డైరెక్టర్ రామముని రమేష్‌కుమార్, చైర్మన్ ఎన్.కృష్ణారావు, పాత నౌపడా సర్పంచ్ ప్రతినిధి దల్లి లోకేశ్వరరెడ్డి, ఎంపిటిసి సుగ్గు అప్పలరాజు పాల్గొన్నారు.



పామును బయటకు తీస్తున్న స్నేక్ క్యాచర్

వలలో చిక్కుకున్న కట్లపాము


పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ అంబుసోలి గ్రామ సమీపంలో ఉన్న చెరువులో చేపలకు ఏర్పాటు చేసిన వలలో అరుదైన కట్లపాము(గౌరి బెత్తు) సోమవారం చిక్కుకుంది. విషయాన్ని గమనించిన స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈస్టర్న్ గాడ్స్ వైల్డ్ లైఫ్ సొసైటి ఓంకార్, అటవీ శాఖ సిబ్బంది సంతోష్ కుమార్, లక్ష్మీనారాయణ, కృష్టారావు ఘటనా స్థలానికి చేరుకొని వలలో చిక్కుకున్న అరుదైన గౌరి బెత్తును అటవీ శాఖ అధికారులు, పాములు పట్టే వ్యక్తిని తీసుకువచ్చి వలను కత్తిరించి విష సర్పాన్ని పట్టుకున్నారు. సమీపంలో ఉన్న మెండు ఫారెస్ట్‌లో సురక్షితంగా విడిచి పెట్టారు.

ఇ-క్రాప్ నమోదు తప్పనిసరి



రైతులకు సూచనలు ఇస్తున్న ఎఒ రాజేశ్వరరావు

బూర్జ: రబీ పంటలకు ఇ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఎఒ వావిలపల్లి రాజేశ్వరరావు రైతులకు సూచించారు. మండలంలోని వావాంలో పెసర, మినుము పంటలను సోమవారం పరిశీలించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని రబీ పంట కింద పెసర, మినుము, వేరుశెనగ, ఉలవులు, మొక్కజొన్న, చెరుకు వంటి పంటలు ఏడు వేల ఎకరాల్లో సాగు అవుతుందని అన్నారు. ఈ పంటలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైఎస్ఆర్ సున్నా వడ్డీ పంట రుణాలు, పంటల బీమా, రైతు భరోసా, మద్దతు ధరకు కొనుగోలు, వ్యవసాయశాఖ ద్వారా అందిస్తున్న ఎరువులు, విత్తనాలు రాయితీలు వర్తించాలంటే ఇ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. సర్వే నంబర్ల వారీగా రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలన్నారు. ఈ నెల 15 వరకు నమోదుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. రైతులు తమ ఆధార్, సాగు భూమి వివరాలతో రైతు భరోసా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని చూచించారు.



సన్మానిస్తున్న సేవా సంఘం సభ్యులు

మరిన్ని సేవలు అందించాలి

కోటబొమ్మాళి: మండలంలోని కొత్తపేటకు చెందిన యువకులు హెల్పింగ్ హ్యాండ్స్ అనే సంస్థ స్థాపించి ఎంతో మంది కష్టాల్లో ఉన్న పేదలకు సహాయ సహకారాలు అందిస్తుందని, ఇంకా ఈ సంస్థ ద్వారా మరింత మంది పేదలకు ఆదుకోవాలని టెక్కలి అభయం యువజన సేవా సంఘం సభ్యులు అన్నారు. అభయం యువజన సేవా సంఘం స్థాపించి ఐదేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రజలకు ఆర్థికంగా సహాయం అందించిన సంఘాలకు సన్మానించారు. అందులో భాగంగా హెల్పింగ్ హ్యాడ్స్ సంస్థ అధ్యక్షుడు కంబాల అప్పలరాజు (ఇరాని టీరాజు)కు సోమ వారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఇలాంటి సంస్థలు మరిన్ని ముందుకొచ్చి పేదలను ఆదుకోవాలని వారు కోరారు.



ఘనజీవామృతాన్ని తయారు చేస్తున్న సిబ్బంది

ఘన ద్రవ జీవామృతం ముద్దు

రణస్థలం: డిఎపి, యూరియాలు వద్దు... ఘన ద్రవ జీవామృతం ముద్దు అని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ రైతులకు పిలుపునిచ్చారు. మండలంలోని వేల్పురాయిలో ఎలకల అసిరినాయుడు 800 కిలోల ఘనజీవామృతం సోమవారం తయారు చేయించారు. ఘనజీవామృతానికి కావాల్సిన పదార్థాలు 400 కిలోల పశువుల పేడ, ఎనిమిది కిలోల బెల్లం, ఎనిమిది కిలోల పప్పు దినుసుల పిండి, పుట్ట మట్టి, సరిపడినంత ఆవు మూత్రం అవసరమని అన్నారు. పెద్దింటి రాజేశ్వరి, సువ్వాడ సత్యవతి, ఎలకల అసిరినాయుడు సంఘ సభ్యులు రైతులు పాల్గొన్నారు.

కమిషన్‌ను కలిసే అవకాశం ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న యోగి

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో నకిలీ బెంతు ఒరియాలపై అధ్యయనం చేసేందుకు ఈ నెల 6న వస్తున్న శామ్యూల్ ఆనంద్‌కుమార్ వన్‌మేన్ కమిషన్ ముందు హాజరయ్యేందుకు ఆదివాసీ, గిరిజనులను అనుమతించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగేశ్వరావు కోరారు. ఈ మేరకు పెద్దపాడులో ఉన్న మంత్రి క్యాంప్ కార్యాలయంలో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు జెడ్‌పిలో నిర్వహించిన స్పందనలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు కూడా వినతిపత్రం అందజేశారు. గత ఏడాది అక్టోబరు 19న శామ్యూల్ ఆనంద్‌కుమార్ కమిటీని ప్రభుత్వం నియమించినట్లు వివరించారు. గతంలో జెసి శర్మను కలిసేందుకు అనుమతించిన మాదిరిగా ఈసారీ ఆదివాసీ సంఘాల అభిప్రాయాలను తెలిపేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఆయనతో పాటు ఆదివాసీ సంఘాల సభ్యులు ఉన్నారు.

ఆటో డ్రైవర్ల నిరాహార దీక్ష

పర్లాకిమిడి : గజపతి జిల్లా పర్లాకిమిడి పట్టణంలో ఆటో డ్రైవర్లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం నిరాహార దీక్ష ప్రారంభించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకటరావు మాట్లాడుతూ ఆటోలపై ప్రభుత్వం వివిధ పన్నులను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. మెళియపుట్టి ఆటో కార్మిక సంఘం అధ్యక్షులు ఎం.ధనంజయరావు, సిపిఎం జిల్లా కమటీ సభ్యులు ముచ్చి బంగారు, సిపిఐ జిల్లా అధ్యక్షులు జొన్న సుభాష్ చంద్రరావు, పైలా మురళి తదితరులు పాల్గొన్నారు.